కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్, బీజేపీకి ఎదురుదెబ్బే..

22 రౌండ్లలో బీఆర్ఎస్ అభ్యర్థికి పోటీ ఇవ్వలేకపోయిన రెండు పార్టీల అభ్యర్థులు

దుండిగల్: అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు గట్టి ఎదురుదెబ్బ తగిలిందనే చెప్పాలి. 22 రౌండ్లలో బీఆర్ఎస్ పార్టీకి కనీసం పోటీ ఇవ్వలేకపోయాయి. బీఆర్ఎస్ మాత్రం ప్రతి రౌండ్‌లో స్పష్టమైన ఆధిక్యంలో దూసుకుపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేకతను అందిపుచ్చుకున్న హస్తం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా తన హవా కొనసాగించినా కుత్బుల్లాపూర్‌లో మాత్రం చతికిల పడింది. అన్ని రౌండ్లలో బీఆర్ఎస్ మెజార్టీ సాధించగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మాత్రం రెండవ స్థానానికి పడ్డాయి. చివరికి బీజేపీ రెండో స్థానంతో సరిపెట్టుకుంది. బీఆర్ఎస్ 46 శాతం ఓట్లు సాధించగా బీజేపీ, కాంగ్రెస్‌లు 25 శాతం ఓట్లు సాధించాయి.

కలిసొచ్చిన సమష్టి కృషి..

అందరి సమష్టి కృషి బీఆర్ఎస్ పార్టీకి కలిసొచ్చింది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఎన్నికలకు మూడు నెలల ముందే ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే వివేకానంద్‌ను ప్రకటించారు. అంతక మునుపే ఆరు నెలల క్రితం వివేకానంద్ ప్రగతియాత్ర చేపట్టి నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాలను చుట్టేస్తూ ప్రజలతో మమేకమయ్యారు.

అందరూ బీఆర్ఎస్ ప్రతినిధులే..

మూడేళ్ల క్రితం జీహెచ్ఎంసీ ఎన్నికలు జరిగాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 8 డివిజన్లు ఉండగా జీడిమెట్ల మినహా అన్ని డివిజన్లను బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. అదే విధంగా నూతనంగా ఏర్పడిన నిజాంపేట కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలను సైతం బీఆర్ఎస్ క్లీన్ స్వీప్ చేసి మేయర్, రెండు మున్సిపల్ చైర్మన్ల స్థానాలను దక్కించుకుంది.

◆ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పర్యటించి కార్యకర్తలు, ప్రజల మద్దతు కూడగట్టారు. ప్రతి డివిజన్, వార్డు, బూత్‌ల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించి ప్రతి ఓటరును కలిసి తమకు ఓటు వేసే విధంగా ఆ పార్టీ నాయకులు ప్రయత్నించి సక్సెస్ అయ్యారు. అంతేకాకుండా ఓటర్లను స్వయంగా పోలింగ్ బూత్‌లకు తరలించడం.. పోల్ మేనేజ్‌మెంట్‌ను పకడ్బందీగా నిర్వహించడం అధిక మెజార్టీ సాధించడానికి కారణమైంది.

కూడగట్టడంలో కాంగ్రెస్ విఫలమా..?

గతంలో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన కేడర్ ఉండేది. అప్పట్లో కూన శ్రీశైలం గౌడ్ కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. దీంతో కాంగ్రెస్ కేడర్ అంతా చెల్లా చెదురైంది. కొన్ని నెలల పాటు ఆ పార్టీ స్తబ్దతగా ఉంది. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి తిరిగి పార్టీలో క్రియాశీలకంగా మారడంతో పార్టీకి పూర్వ వైభవం వచ్చినట్లు అయ్యింది.

◆ కొలన్ హన్మంత్‌రెడ్డి, సొంటిరెడ్డి పున్నారెడ్డి, భూపతిరెడ్డి, కందాడి జ్యోత్స్నారెడ్డి టికెట్ ఆశించగా హన్మంత్‌రెడ్డికి చివరి నిమిషంలో టికెట్ లభించింది.అయన మిగిలిన వారితో త్వరగానే కలుపుకుని విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ జన సమితి, వైఎస్ఆర్‌టీపీ, సీపీఐలు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చినా ఇక్కడ ఆ పార్టీలు ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయాయి. కాంగ్రెస్ పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంక్, ఓ సామాజికవర్గం ఓట్లు మాత్రమే కాంగ్రెస్‌కు వచ్చాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

కార్యకర్తలే బలంగా..

ఒక బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ కార్యకర్తలే తన బలంగా భావించి ఎన్నికల బరిలో నిలిచారు. తాను పోలిస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్, 2009లో ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి పనులను ఎన్నికల్లో వివరించారు. సొంత అనుచర గణం, నమ్మిన కార్యకర్తలు, బీజేపీ ఉత్తర భారతదేశ ఓటర్లు మాత్రమే ఆయనను ఆదరించారు. జనసేనా ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు. గతంలో శ్రీశైలంగౌడ్‌ను అభిమానించిన ద్వితీయశ్రేణి నాయకులు ఇతర పార్టీలో ఉండడం ఆయనకు మైనస్‌గా మారింది. మైనార్టీలు సైతం ఆయనకు దూరమయ్యారు. గత రెండు పర్యాయాలు ఇక్కడ బీజేపీకి 5వేలు, 9 వేలు ఓట్లు మాత్రమే రాగా ఈ దఫా ఏకంగా లక్షకు పైగా ఓట్లు సాధించడం విశేషం.

◆ నియోజకవర్గంలోని జంట సర్కిళ్ల పరిధిలోని 8 డివిజన్లు, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల వారీగా ఆయా పార్టీలకు పోలైన వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి. జీహెచ్ఎంసీలో బీఆర్ఎస్ పార్టీకి సుభాష్‌నగర్‌లో అత్యధికంగా 10,924 రాగా అత్యల్ప మెజార్టీ జీడిమెట్లలో 4303 వచ్చింది.

డివిజన్	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	బీఆర్ఎస్	బీజేపీ	కాంగ్రెస్	మెజారిటీ
గాజులరామారం	71842	44864	22860	12283	8473	10577
జగద్గిరిగుట్ట	53933	31186	14947	9032	6147	5915
రంగారెడ్డినగర్	46068	27421	14789	6477	5509	8312
చింతల్	41318	24280	13081	4990	5648	8091
సూరారం	61660	35672	16837	9632	8348	7205
సుభాష్‌నగర్	77669	44073	21077	10153	11675	10924
కుత్బుల్లాపూర్	58714	32950	15602	8442	8238	7160
జీడిమెట్ల	62763	35290	15447	11144	7858	4303
మున్సిపాలిటీలు..						
నిజాంపేట్	134718	67647	28751	14560	23051	14191
దుండిగల్	58337	36798	16270	9468	10064	6802
కొంపల్లి	32108	19671	7666	5746	5873	1920
మొత్తం	699130	399852	187327	101927	100884	85400

కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో పేట్‌బషీరాబాద్ కట్టమైసమ్మ

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్‌లోని శ్రీ కట్టమైసమ్మ ఆలయంలో మంగళవారం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కమిటీ వ్యవస్థాపకులు వివేక్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా మైసమ్మగూడ నరసింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల త్రిశూల్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించిన ఈ అన్నప్రసాద వితరణలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకుముందు శ్రీకట్ట మైసమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు చేసి అభిషేకం నిర్వహించారు.

వ్యక్తి అదృశ్యం



రాము (ఫైల్)

జగద్గిరిగుట్ట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట పరిధి శ్రీనివాస్‌నగర్‌కు చెందిన యాదాటి రాము(50) ఈనెల 2వ తేదీ రాత్రి 7గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం వెతికినా లభించలేదు. దీంతో చేసేది లేక వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు అంబేడ్కర్ స్మారక ఉపన్యాసం

లిబర్టీ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 6న అంబేడ్కర్ స్మారక ఉపన్యాసం నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె.లింగయ్య, ప్రధాన కార్యదర్శి గనుముల జ్ఞానేశ్వర్ తెలిపారు. తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్‌టీఆర్ సమావేశ మందిరంలో 38వ స్మారక ఉపన్యాసం నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డాక్టర్ విశ్వ వైతాళికుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అంశంపై డాక్టర్ ఘంటా చక్రపాణి ఉపన్యాసం చేస్తారన్నారు. 37 ఏళ్లుగా స్మారక ఉపన్యాస పరంపర కొనసాగుతుందన్నారు. మేధావులు, రచయితలు, కవులు, కళాకారులు, దళిత బహుజనలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బీసీ కుల గణన చేపట్టాలి

లిబర్టీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ కుల గణనపై పార్లమెంటులో ప్రకటించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్రు కుమారస్వామి అన్నారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీలు ఎదుర్కొంటున్న సమస్యను కూడా పరిష్కరించలేదన్నారు. మంగళవారం దళ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే కుల గణనపై స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ కుల గణనపై ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రక్రియను వేగవంతం చేసే పనిలో ఉన్నారన్నారు. అదే తరహాలోనే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. చట్టసభల్లో రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టాలని, బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల సమస్యల పరిష్కరించని పక్షంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించి తీరుతామని స్పష్టం చేశారు. సమావేశంలో సాయి, సుభాష్, నవ్య తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే ఐఫోన్ అంటూ మెసేజ్..

- సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి
- రూ.6 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: ఇన్‌స్టాగ్రామ్‌లో ఐఫోన్ తక్కువ ధరకనే మెసేజ్ రావడంతో కొనడానికి ప్రయత్నించే క్రమంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.ఆరు లక్షల 2 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ రాఘవేంద్ర కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సెప్టెంబర్ 25వ తేదీన ఇన్‌స్టాగ్రామ్‌లో ఐఫోన్ 13 వేలకు వస్తుందని వచ్చిన మెసేజ్‌ను చూసి అపరిచిత వ్యక్తిని సంప్రదించారు.దీంతో ఆ వ్యక్తి ఓ లింకు పంపగా తన వివరాలు నమోదు చేశాడు.అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా చేయడంతో ఐదు దఫాలుగా తన ఖాతాలో ఉన్న రూ. ఆరు లక్షల రెండు వేలు పోగొట్టుకున్నాడు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి మంగళవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లోన్ ఇస్తామంటూ వచ్చిన ఫోన్ కాల్‌కు..

◆ రెండు లక్షల 71 వేలు పోగొట్టుకున్న గృహిణి లోన్ ఇస్తామంటూ వచ్చిన ఫోన్‌కాల్‌కు స్పందించి, ఓ గృహిణి రూ.రెండు లక్షల 71 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ కు చెందిన ఓ గృహిణికి నవంబర్ 6 వ తేదీన రూ.లక్ష రూపాయలు లోన్ ఇస్తామంటూ ఫోన్ కాల్ వచ్చింది.దీంతో బాధితురాలు అపరిచిత వ్యక్తి పంపిన లింకులో తన వివరాలు నమోదు చేసింది.నమోదు చేసిన కొద్దిసేపటికి తన ఖాతాలో ఉన్న రూ.రెండు లక్షల 71 వేలు పోగొట్టుకుంది. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి బాధితురాలు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, మంగళవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వివేకానంద్‌కు అభినందనల వెల్లువ



విజయోత్సవాల్లో భాగంగా వివేకానంద్‌ను సత్కరించిన బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు

కుత్బుల్లాపూర్: ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించిన వివేకానంద్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు బొకేలు అందజేసి స్వీట్లు తినిపించి శాలువలతో సత్కరించారు.

◆ ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ నాయకుడికి ఇవ్వని భారీ మెజార్టీని అందించి ఎమ్మెల్యేగా ఆశీర్వదించిన ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. వచ్చే ఐదేళ్ల కాలంలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పరుస్తానన్నారు.

◆ రంగారెడ్డినగర్‌కు చెందిన శెట్టిబలిజ సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. బీసీ కులాల జాబితాలో తమను చేర్చేలా అసెంబ్లీ వేదికగా పోరాడాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసిన శెట్టిబలిజ సంక్షేమ సంఘం సభ్యులు

వీఎన్ఆర్ వీజేఐఈటీకి డైమండ్ సర్టిఫికెట్

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రముఖ క్యూఎస్ ఐ-గేజ్ సంస్థ నుంచి డైమండ్ రేటింగ్‌ను సాధించింది. ఇటీవల రాజస్థాన్‌లోని జైపూర్‌నగరంలో జరిగిన క్యూఎస్-ఐ గేజ్ ఇండియా అకడమిక్ ఫోరమ్ జాతీయ స్థాయి కార్యక్రమంలో సంస్థ సీఈవో అశ్విన్ ఫెర్నాండేజ్, సీఈవో రవీన నాయర్ చేతుల మీదుగా వీఎన్ఆర్ వీజేఐఈటీ ప్రధాన కార్యదర్శి జాస్తి శేషగిరిరావు, కళాశాల పీఏపీ విభాగం పర్యవేక్షకుడు డాక్టర్ రవికుమార్, క్యూఎస్ రేటింగ్ సమన్వయకర్త డాక్టర్ రజనీకుమార్‌లు డైమండ్ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీడీ నాయుడు మాట్లాడుతూ... 2019–22 కాలానికి తెలంగాణ రాష్ట్రం నుంచి క్యూఎస్ గేజ్ నుంచి డైమండ్ సర్టిఫికెట్ పొందిన ఏకైన విద్యాసంస్థగా వీఎన్ఆర్ వీజేఐఈటీ నిలిచిందన్నారు. ప్లానింగ్, అప్రూవల్స్, అక్రెడిటేషన్స్, సర్టిఫికేషన్స్, మౌలిక సదుపాయాలు వంటి విషయాలను పరిగణనలోని తీసుకుని డైమాండ్ సర్టిఫికెట్ అందించారన్నారు.



క్యూ ఐ గేజ్ సంస్థ నుంచి డైమండ్ సర్టిఫికెట్‌ను అందుకుంటున్న వీజేఐఈటీ ప్రతినిధులు

బస్టాప్‌లో హార్ట్‌ఎటాక్.. చికిత్స పొందుతూ మృతి

సుభాష్‌నగర్: బస్టాప్‌లో నిలుచున్న వ్యక్తికి హార్ట్ ఎటాక్ రావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయిబాబానగర్ బస్టాప్ వద్ద నిలుచున్న ఓ వ్యక్తి (50)కి ఛాతిలో నొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వెంటనే సదరు వ్యక్తిని 108లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతడి పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని సూరారం పోలీసులు కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



9న కార్తీకమాస వనభోజనాలు

సుభాష్‌నగర్: సూరారం రామ్‌లీలా మైదానంలో ఈనెల 9వ తేదీన కార్తీకమాస వనభోజనాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5.30 గంటల నుండి 6.30 గంటల వరకు 21 సార్లు హనుమాన్‌చాలీసా పఠనం, రాత్రి 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 8గంటలకు దీపోత్సవం కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్తీక వనభోజనాలు విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నిర్వాహకులు కోరారు. ఎవరైనా ధనరూపేణా సహాయం చేయాలనుకుంటే ఫోన్ నం.94932 16515కు పంపాలని నిర్వాహకులను కోరారు.

జన్మదిన శుభాకాంక్షలు



దామోదర రాజనరసింహకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న భరత్‌గౌడ్

జగద్గిరిగుట్ట: మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆందోల్ ఎమ్మెల్యే దామోదర రాజనరసింహ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కాంగ్రెస్ ఓబీసీ రాష్ట్ర జాయింట్ కో.ఆర్డినేటర్ గడ్డమీది భరత్‌గౌడ్ మార్యదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. త్వరలో ఏర్పడబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో రాజనరసింహకు సముచిత స్థానం లభిస్తుందని భరత్‌గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన బండి శ్యామ్‌గౌడ్



చింతల్: మల్కాజిగిరి పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి శ్యామ్‌గౌడ్ మంగళవారం నగరంలోని ఎల్లా హోటల్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్యామ్‌గౌడ్ మాట్లాడుతూ... రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిందన్నారు. రానున్న రోజుల్లో పార్టీని బలోపేతం చేస్తూ పేదల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం

ఆర్‌బీఓ మేడ్చల్ రీజినల్ మేనేజర్ రవికిరణ్

కుత్బుల్లాపూర్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు రుణాలు ఇచ్చే విషయంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పారదర్శంగా పని చేస్తుందని ఆర్‌బీఓ మేడ్చల్ రీజినల్ మేనేజర్ రవికిరణ్ అన్నారు. మంగళవారం పేట్‌బషీరాబాద్ సమీపంలోని వసుధ ఎలైట్ హోటల్‌లో బ్యాంక్ ఖాతాదారులతో టౌన్‌హాల్ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన రవికిరణ్, మేడ్చల్ ఆర్బీవో చీఫ్ మేనేజర్ పీఏ న్‌వీఎస్ శేఖర్, ఎస్‌బీఐఎల్‌డీ గచ్చిబౌలి చీఫ్ మేనేజర్‌లు డి.హరికృష్ణ, సూర్యప్రీతిలు మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో కార్పొరేట్ బ్యాంక్‌లకు దీటుగా ఎస్‌బీఐ సేవలు అందిస్తూ వినియోగదారుల మన్ననలు పొందుతోందన్నారు. రుణాలు అందజేయడంలో.. వసూళ్లలో మెరుగైన స్థానంలో ఉన్నామన్నారు. భవిష్యత్‌లో ఖాతాదారులకు మరింత చేరువయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



ఖాతాదారుల టౌన్‌హాల్ మీటింగ్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న అధికారులు

అక్రమణ నిర్మాణాలకు పాల్పడితే కఠిన చర్యలు



నిజాంపేట్ సర్వే నం.334లో గదిని జేసీబీతో కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

నిజాంపేట్: ఎన్నికల నేపథ్యంలో అధికారులు విధుల్లో బిజీగా ఉండగా మరో పక్క కబ్జారాయుళ్ల చడీచప్పుడు లేకుండా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలను పూర్తి చేశారు. ఎన్నికల బిజీ నుంచి రిలీవ్ అయిన రెవెన్యూ అధికారులకు అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందడంతో మంగళవారం కొరడా ఝుళిపించారు. బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ సర్వే నం.334, 191లలో చోటు చేసుకున్న పలు అక్రమ నిర్మాణాలను తహసీల్దార్ ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది జేసీబీ సహాయంతో కూల్చివేశారు. మరోసారి అక్రమణ నిర్మాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏకపక్ష నిర్ణయాలతోనే బీఆర్ఎస్ ఓటమి

లిబర్టీ: బీఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర్‌రావు ఏకపక్ష నిర్ణయాలు, నియంతృత్వం వైఖరి కారణంగా ఆ పార్టీ ఓటమి పాలైందని లోక్ దళ్ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు పీవీ రాజేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ మితిమీరిన ఆత్మవిశ్వాసం, పార్టీ నాయకులు, కార్యకర్తలను విస్మరించినందునే 39 స్థానాలకు పరిమితమయ్యారని స్పష్టం చేశారు. రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరారు.

పోలీసుల బారికేడ్లనే ఎత్తుకెళ్లారు!

ఫిర్యాదు చేసిన ట్రాఫిక్ పోలీసులు

జీడిమెట్ల: దొంగలు ఏకంగా పోలీసుల సొమ్ముకే ఎసరు పెట్టారు. దొంగలు దొరల్లాగా వచ్చి ఏకంగా బారికేడ్లనే ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎన్నికల నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు కుత్బుల్లాపూర్ మున్సిపల్ జంక్షన్‌లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఎలక్షన్ల అనంతరం వాటిని పీఎస్‌కు తరలించేందుకు అక్కడే ఉంచారు. ఎన్నికల బిజీ అయిపోవడంతో పోలీసులు వాటిని తీసుకెళ్లేందుకు రాగా అక్కడ బారికేడ్లు కనిపించలేదు.

◆ త్వరలో పట్టుకుంటామంటున్న పోలీసులు ఈ విషయమై జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు లాఅండ్ అర్డర్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. వారి పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీ కెమరాలను పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తులు బారికేడ్లను ఆటోలో తరలించినట్లుగా గుర్తించారు. త్వరలోనే వారిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

ప్లాస్టిక్ నియంత్రణ.. కరువైంది పర్యవేక్షణ

- నిరుపయోగంగా ఎనీ టైమ్ బ్యాగ్ మెషిన్
- సదుద్దేశంతో ఏర్పాటు.. కొన్నిరోజులకే బుట్టదాఖలు

చింతల్: పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఎన్ని విధాలుగా ప్రయత్నించినా అవి బుట్టదాఖలుగా మిగిలిపోతున్నాయి. ప్లాస్టిక్ నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినా అవి ఆచరణలోకి రావడం లేదు. బాలానగర్ నుంచి ఐడీపీఎల్‌కు వెళ్లే రోడ్డులో ఓ పరిశ్రమకు చెందిన ఖాళీ స్థలంలో తోపుడు బండ్లపై పండ్లను విక్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్లాస్టిక్ బ్యాగ్‌ల నివారణకు ఓ సంస్థ ముందుకొచ్చి క్యారీ (పేపర్) బ్యాగ్ మెషిన్‌ను ఏర్పాటు చేసింది.

ఏడాది క్రితం ఏర్పాటు

ఏడాది క్రితం సదరు స్వచ్ఛంద సంస్థ, జీహెచ్ఎంసీల సంయుక్త ఆధ్వర్యంలో క్యారీ బ్యాగ్ మెషిన్‌ను ఏర్పాటు చేసింది. అక్కడ ఏర్పాటు చేసిన మెషిన్‌లో రూ.10 నోటు వేయగానే పేపర్ బ్యాగ్ బయటకు వస్తుంది. సదరు పండ్ల దుఖాణాదారులే బ్యాగ్ కొనుగోలు చేసేలా చూడాలని అధికారులు వ్యాపారులతో చర్చలు జరిపారు.



మెషిన్ చుట్టూ ఏర్పాటైన పండ్ల దుకాణాలు



బాలానగర్ ఐడీపీఎల్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఎనీ టైమ్ బ్యాగ్ మెషిన్

మెషిన్ చుట్టూ దుకాణాల ఏర్పాటు

కానీ కొన్ని రోజుల తరువాత అక్కడ ఉన్న 'ఎనీ టైమ్ బ్యాగ్ మెషిన్'ను గాలికి వదిలేశారు. మెషిన్ చుట్టూ మరో నాలుగు దుఖాణాలు ఏర్పాటు చేయడంతో మెషిన్ కనిపించకుండా పోయింది. దీనికి తోడు జీహెచ్ఎంసీ అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో ఆ మెషిన్ నిరుపయోగంగా మారింది.

నిలిచిపోయిన పనులను వెంటనే చేపట్టాలి

రంగారెడ్డినగర్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో రెండు నెలలుగా జంట సర్కిళ్ల పరిధిలో అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. ఈ నేపథ్యంలో రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్, రంగారెడ్డినగర్, పంచశీల కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ లైన్ పనులు పూర్తయ్యాయి. ఆ ప్రాంతాల్లో కొత్తగా సీసీ రోడ్లకు రూపకల్పన చేయగా కోడ్ అమలులోని రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో కంకర వేసి నిలిచిపోయి, భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తయి మట్టి కుప్పలతో నిండిన రోడ్లపై రాకపోకలు సాగించేందుకు జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా ఎన్నికల కోడ్ ముగియడంతో సదరు పనులను వేగవంతంగా చేపట్టి పూర్తిచేయాలని బస్తీవాసులు కోరుతున్నారు.



రంగారెడ్డినగర్‌లో ఓం జెండా సమీపంలోని గల్లీలో కంకర వేసి వదిలేసిన దృశ్యం




జీడిమెట్ల గ్రామంలో తెగిపడిన విద్యుత్ తీగలు


ఈదురు గాలులు.. తెగిన విద్యుత్ తీగలు

తుఫాను ప్రభావం వల్ల కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తేలికపాటి వర్షం కురిసింది. చల్లటి గాలులు వీచాయి. ఈదురు గాలులకు అక్కడక్కడ చెట్ల కొమ్మలు, విద్యుత్ వైర్లు తెగిపోయాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో చాలా చోట్ల చలి మంటలు వేసుకొని ఉపశమనం పొందారు.

– సుభాష్‌నగర్



కొంపల్లిలో గొడుగు వేసుకుని వెళ్తున్న విద్యార్థులు



జాతీయ రహదారి-44ను ఆనుకుని గుడారాల్లో చలిమంట కాగుతూ..